క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



కర్ణాటక హైకోర్టు జడ్జి కుటుంబ సభ్యులతో ఆలయ ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయన గురువారం కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

దళిత సత్రం కోసం నిరసన



ఆలయ ఈఓకు వినతి పత్రం ఇస్తున్న విశ్రాంత ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కేశువులు, దళితనాయకులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద దళితుల సత్రం కోసం విశ్రాంత ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కేశువులు, దళిత ఉభయదారులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కాణిపాక ఆలయం పక్కన ఉన్న దళితుల స్థలాన్ని ఆలయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తరువాత ఆలయ పరిసరాల్లో స్థలం ఇస్తామని చెప్పారు. కానీ ఇవ్వలేదని వాపోయారు. దీనిపై గురువారం ఉదయం ఆలయం వద్ద దళిత ఉభయదారులతో కలసి అడిషనల్ కమిషనర్ కేశువులు, చిత్తూరు, ఐరాల మండలంలోని దళిత నాయకులు, నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రైవేటు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించి సత్రానికి స్థలం ఇచ్చేంత వరకు పోరాటం ఆపేలేదని తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆలయ ఈఓ వెంకటేశుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, పి కేశువులు, జలంధర్, రఘు, సత్యనారాయణ, సుబ్బయ్య, మునస్వామి, జయరామయ్య, గుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 18మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుడిపాల: సీఎస్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ లోకేష్ తెలిపారు. గురువారం కళాశాలలో బెంగళూరుకు చెందిన మెడి అసిస్ట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులకు వార్షిక వేతనం కింద రూ.2.2లక్షలు ఇస్తామని కంపెనీ ప్రతినిధి అంజన్‌కుమార్ తెలిపారు. ప్రతి ఏటా కళాశాలలో ఇస్తున్న శిక్షణ మూలాన పలువురు విద్యార్థులు ప్రాంగణ ఎంపికలకు ఎంపికవుతున్నారని లోకేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వేదవతి, జ్యోత్స్న, అర్జున్, యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



ఎన్నికైన ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో కొంగారెడ్డిపల్లెలోని ఆఫీసర్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం ఆఫీసర్స్ క్లబ్‌లో కలెక్టర్ షన్‌మోహన్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా కలెక్టర్, ఉపాధ్యక్షులు గా ఎస్పీ వ్యవహరిస్తారు. ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సుభాష్, కోశాధికారిగా నరసింహారెడ్డి, క్రీడా సెక్రటరిగా రవి, కార్య నిర్వాహక సభ్యులుగా చంగల్‌రెడ్డి, కుమారస్వామిరెడ్డి, గోపినాథ్, వాసుదేవనాయుడు తదితరులు ఎన్నికయ్యారు. ఆఫీసర్స్ క్లబ్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ చెప్పారు. నూతన కార్యవర్గాన్ని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అభినందించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

బైరెడ్డిపల్లె: ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయినందుకు మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బైరెడ్డిపల్లెకు చెందిన క్రిష్ణప్ప కుమారుడు బాబు (19) ఎంపీసీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివాడు. బుధవారం వెలువడిన ఫలితాల్లో బాబు గణితం–బీ (మ్యాథ్స్) సబ్జెక్టులో తప్పినందుకు మనస్తాపం చెంది రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటనరసింహులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి గడపలోనూ నవరత్న కాంతులు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు.

బంగారుపాళెం: నవరత్న పథకాలతో ప్రతి గడపలో సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కూర్మాయిపల్లె, రోళ్లవారిపల్లె, దళితవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రభుత్వం ద్వారా ఏ పథకం కింద ఎంత లబ్ధి చేకూరుతోందో లబ్ధిదారులకు తెలియజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, కొత్తరేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, మురుగు నీటి కాలువలు, సిమెంట్‌రోడ్ల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామంలో పథకాల ద్వారా రూ.3.40 లక్షలు లబ్ధి పొందిన దామోదర్‌రెడ్డి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లారు. ఆ ఇంటి ఆవరణలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాన్ని పూలతో అలంకరించి, పథకాల బుక్‌లెట్‌ను చిత్రపటం ముందు చూసి ఎమ్మెల్యే ముగ్ధుడయ్యారు.

అభివృద్ధి నిర్మాణాలు ప్రారంభం

కూర్మాయిపల్లె పంచాయతీలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ 21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచులు హేమలత, దీప, భారతమ్మ, శ్రీనివాసులు, బాలాజీ, ఎంపీటీసీలు ఇందుశేఖర్‌రెడ్డి, హేమచంద్ర, సింగిల్ విండో, ఏఎంసీ చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, నారే సోమశేఖర్, జిల్లా పార్టీ కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, శరత్ రెడ్డి, బాబుతోపాటు వివిధ శాఖల మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కల్లూరుపల్లెలో..

మండలంలోని కల్లూరుపల్లె పంచాయతీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మ్యుటేషన్ పేరిట దందా

- వసూళ్ల పర్వంలో కొందరు వీఆర్వోలే కీలకం
- రూ.5 వేల నుంచి రూ.8 వేలు డిమాండ్
- లేకుంటే తప్పని తిప్పలు
- వందల్లో మ్యుటేషన్ ఫైళ్లు పెండింగ్



తహసీల్దార్ కార్యాలయం

వీఆర్వో: ఏమియా ఇలా వచ్చావు?

రైతు: నమస్కారం స్వామి..మా నాయనా చనిపోయినాడు..పట్టా చేసుకోవాలి.

వీఆర్వో: పాసు బుక్కు ఇదా!..మీ నాయనికి ఎంత మంది కొడుకులు..కూతుర్లు..పోయి ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెటు, డెత్ సర్టిఫికెటు, ఆధార్, రేషన్‌కార్డులు తీస్కొన్రా.

రైతు: స్వామీ అన్నీ ఉండాయి. మా నాయనకు నేనొక్కడే కొడుకు.

వీఆర్వో: అలానా...ఇప్పుడు టైం లేదు..రేపు రా.

రైతు: దీని కోసం సంవత్సరంగా తిరగతాండా.. ఇప్పుడు కూడా అట్లా అంటే ఎలా స్వామీ?

వీఆర్వో: ఎంతుండాది నేల?

రైతు: .1.30 ఎకరా ఉంది.

వీఆర్వో: ఎకరా అంటున్నావ్..రూ. 10 వేలు ఇచ్చేయ్..వాళ్లకు..వీళ్లకు కూడా ఇవ్వాలి. డబ్బులిస్తే..నీ పని ఇప్పుడే చేసిపెడతా. నెలలో పాసుబుక్ నీ చేతిలో ఉంటాది.

రైతు: బీదోణ్ని స్వామి..ఇట్లంటే ఎట్లా? పనయితే ఎంతో కొంతిస్తా..చూడు స్వామీ.

వీఆర్వో: సరే లేయా..డబ్బులు ఎంత ఇస్తావో ఇచ్చేయ్.. ఫైలు తీసుకోరా.


మండల కేంద్రంలో మ్యుటేషన్ కోసం వెళ్లిన ఓ రైతు..వీఆర్వో నడుమ సాగిన సంభాషణ ఇది.

గుడిపాల: మండలంలో మ్యుటేషన్‌కు రెవెన్యూ ఉద్యోగులు మామూళ్లు గుంజడం పరిపాటిగా మారిందనే విమర్శలొస్తున్నాయి. రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఇస్తే తప్ప మ్యుటేషన్‌కు మోక్షం కలగడం లేదు. ఇందులో కొందరు వీఆర్వోలు ముఖ్య భూమికను పోషిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయ పరిధిలో 32 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో 13 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. వీరి వద్దకు నిత్యం పదుల సంఖ్యలో రైతులు, ప్రజలు వివిధ పనుల నిమిత్తం వస్తూంటారు. అలాగే కార్యాలయానికీ వస్తూంటారు. వీరిలో చాలా మంది భూ సమస్యలతో పాటు మ్యుటేషన్ కోసం వచ్చేవారే ఉంటుస్తున్నారు. నెలకు 40 నుంచి 60 వరకు మ్యుటేషన్ దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది.

వీటికి మోక్షమెప్పుడో..?

మండలంలో మ్యుటేషన్ ఫైళ్లు దాదాపు 120 వరకు ఆరునెలల నుంచి పెండింగ్ ఉన్నట్లు సమాచారం. మ్యుటేషన్ ఫైలు కదలాలంటే వీర్వోలు డిమాండ్ చేసినంత ఇవ్వాల్సి వస్తోందని కొందరు రైతులు లబోదిబోమంటున్నారు. కొందరు వీర్వోలు కార్యాలయానికి వచ్చి అలా వెళ్లిపోతున్నారు. వచ్చినా ఆ కొందరు మధ్యాహ్నం వేళకే దుమ్మూ కొడుతున్నారు. కొందరు మాత్రం ప్రైవేటు భవనంలో సేదదీరుతున్నారు. ఇక చేయి తడపరని భావిస్తే ఆ ఫైల్‌ను ఆన్‌లైన్‌లో దరఖాస్తు పెట్టనివ్వడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులైనా మ్యుటేషన్ కష్టాల నుంచి విముక్తి కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు



మ్యుటేషన్‌కు సంబంధించి వీఆర్ఓలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారనేది నా దృష్టికి రాలేదు. రైతులు ఎవరైనా ఇచ్చినట్లయితే నా దృష్టికి ఆధారాలతో తీసుకువస్తే పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకుంటాం.

-బాబూ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్, గుడిపాల

పీహెచ్‌సీల్లో అన్ని వసతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు

– ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తోందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పి కొత్తకోట సీహెచ్‌సీలో గురువారం కమిటీ సమావేశాన్ని డాక్టర్ పావని చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పేద ప్రజలకు ఇంటి వద్దనే ఉచిత వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం అమలు చేస్తోందని చెప్పారు. ఉత్తమ సేవలందించడంలో జిల్లాలోనే పి.కొత్తకోట సీహెచ్‌సీకి రెండవ స్థానం వచ్చిందని గుర్తుచేశారు. అనంతరం డాక్టర్ పావని చంద్ర ఆస్పత్రి అజెండాను కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ కో–చైర్మన్ రాజారత్నం రెడ్డి, సర్పంచ్ పద్మజారాణి, మండల సచివాలయం కన్వీనర్ సుధాకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, నాగరాజా, నిరంజన్ రెడ్డి, ప్రవీణ్, నవీన్ రెడ్డి, బాలాజీ, ప్రసాద్ రెడ్డి, కళైసెల్వి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

చిత్తూరు రూరల్: వడదెబ్బపై చిత్తూరు మండలం చెర్లోపల్లె, ఏనుగుంట్లపల్లె పాఠశాలల్లో గురువారం ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవికాలంలో వచ్చే ప్రధానమైన ఆరోగ్య సమస్యలను వివరించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రేవతి, అపర్ణ, అల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మెరిసిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు



జీవిత సౌమ్యప్రియా ఉమా

యాదమరి: నియోజకవర్గంలోని ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఐరాల, పూతలపట్టు, బంగారుపాళెం మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. యాదమరిలో బాలికల జూనియర్ కళాశాల ఉంది. మొదటి సంవత్సరంలో 288 మంది విద్యార్థులకుగాను 77 మంది, ద్వితీయ సంవత్సరంలో 286 మంది విద్యార్థులకు 128 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఐరాల మండలంలోని వీఎస్ అగ్రహారానికి చెందిన బాబు, పుష్ప దంపతుల కుమార్తె సౌమ్యప్రియ మండల టాపర్‌గా నిలిచారు. తల్లి దండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివించారు. తల్లి దండ్రుల కష్టాలను కళ్లారా చూసిన విద్యార్థి 892 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

తెలుగులో 99 మార్కులు

యాదమరి మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం ప్రారంభించిన బాలికల కళాశాలలో జీవిత తెలుగులో 99 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. కళాశాల ఏర్పాటైన తొలి సంవత్సరంలోనే యాదమరి మండలం పేరు రాష్ట్ర స్థాయిలో నిలవడంపై అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కూలీ ఇంట మార్కుల పంట

పూతలపట్టు మండలంలోని అమ్మేపల్లెకు చెందిన నరేష్, కల్యాణి దంపతులు కూలీలు. వారి కుమార్తె ఉమా ఇంటర్ ఫలితాలలో 874 మార్కులు సాధించి మండలంలో మొదటిస్థానంలో నిలిచింది. దీంతో వారి ఇంట సంబరాలు జరుపుకున్నారు. మెడిసిన్ చదివిస్తామని తల్లి దండ్రులు చెపుతున్నారు.

కొత్తపేటలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రశాంతి



ఐరాల : ఎర్రేపల్లెలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్



జి.గొల్లపల్లెలో ...

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని 104 వైద్యాధికారి ప్రశాంతి అన్నారు. గురువారం మండలంలోని కొత్తకోటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్ర చికిత్సలు చేయించకున్న వారికి ఇంటి వద్దనే వైద్యసేవలను అందించారు. వైద్య సిబ్బంది హైమావతి, సుమతి, గీత, తమరై పాల్గొన్నారు.

పి.ఎర్రేపల్లెలో..

ఐరాల: మండలంలోని పి.ఎర్రేపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ శివయ్య, ఎంపీహెచ్‌ఎస్ నాగరత్నమ్మ, ఏఎన్ఎం భువనేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జి.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లెలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి అన్యూహ స్పందన లభించింది. వైద్యాధికారి మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన సావిత్రి రోగి ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పౌర సేవల్లో జాప్యం..ఉద్యోగులకు అపరాధం వడ్డన

– చర్యలకు పూనుకున్న కమిషనర్



కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: మున్సిపల్ సర్వీసుల సమస్యలు, ప్రజా ఫిర్యాదులను నిర్ణీత సమయంలో (ఎస్ఎల్ఏ) పరిష్కరించని అధికారులపై నగర కమిషనర్ జె.అరుణ కఠిన చర్యలు తీసుకున్నారు. జాప్యం చేసిన అధికారులకు నిబంధనలు ప్రకారం అపరాధ రుసుం విధిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ణీత సమయంలోపు పౌర సేవలు, ఫిర్యాదులను పరిష్కరించాలని కమిషనర్ ఇదివరకే పలుసార్లు హెచ్చరించారు. రోజువారీ నిర్వహించే శాఖాపరమైన సమీక్షల్లోనూ హెచ్చరించారు. అయినా పలు విభాగాల్లో అధికారులు, ఉద్యోగుల తీరు మారకపోవడంతో కొరడా ఝళిపించారు. కొళాయి కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్సులు, ఆస్తి పన్నుకు సంబంధించిన పౌర సేవలు, ఫిర్యాదులను నిర్దేశించిన సమయంలో (ఎస్ఎల్ఏ గడువు లోపల) పరిష్కరించని అధికారులపై చర్యలకు పూనుకున్నారు. పౌర సేవలు, ఫిర్యాదుల పరిష్కారంలో ఒకరోజు జాప్యానికి రూ.100 చొప్పున అపరాధ రుసుం విధించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ విభాగాలకు సంబంధించి 14 మంది అధికారులు/ఉద్యోగులు, ఇద్దరు అమినిటీ కార్యదర్శులు, నలుగురు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు వారి సర్వీసుల సంఖ్య బట్టి అపరాధ రుసుం విధించారు.

బదిలీపై వెళుతున్న న్యాయమూర్తులకు సన్మానం



న్యాయమూర్తి సులోచనారాణిను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

చిత్తూరు అర్బన్: చిత్తూరులో పనిచేస్తూ బదిలీపై ఇతర జిల్లాలకు వెళుతున్న న్యాయమూర్తులను న్యాయవాదుల సంఘం (బార్) గురువారం ఘనంగా సన్మానించింది. బదిలీపై వెళుతున్న న్యాయమూర్తులు శాంతి, సులోచనారాణి, రవిని జిల్లా జడ్జి భీమారావు, బార్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రనాథ్‌రెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందచేశారు. న్యాయమూర్తుల సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో జడ్జిలు కరుణకుమార్, శాంతి, బార్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి శాంతిని..



మేజిస్ట్రేట్ రవిని..

మళ్లీ రోడ్డు మీద 'గజ గజ'



గుడియాత్తం రోడ్డుపై ముసలిమొడుగు వద్ద రోడ్డుపైకొచ్చిన ఏనుగుల గుంపు

పలమనేరు: మండలంలోని మొసలిమొడుగు దర్గా వద్ద పలమనేరు–గుడియాత్తం రహదారిలో గురువారం ఉదయం 22 ఏనుగులు ప్రత్యక్షమయ్యాయి. దీంతో ఆమార్గంలో వెళ్లేవారు హడలిపోయారు. కొంతసేపు ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. విషయం తెలుసుకొన్న ఎలిఫెంట్ ట్రాకర్స్ వాటిని అడవిలోకి మళ్లించారు.

పంటలపై దాడి

ఇదిలా ఉండగా, ఏనుగులు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, క్రిష్ణప్ప, నిర్మలమ్మకు చెందిన వరి, టమాటా, మామిడి పంటలకు నష్టం కలిగించాయి. పంట నష్టాన్ని స్థానిక అటవీశాఖ సిబ్బంది అంచనా వేసి నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ



విద్యావికాస్‌లో ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ప్రకాష్‌చంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలు కళాశాలల్లో ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.

- కొంగారెడ్డిపల్లెలోని విద్యావికాస్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో దుర్గశ్రీ 987, హేమలత 983, బైపీసీలో జ్ఞానచందన 983 మార్కులు సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ ప్రకాష్‌చంద్రారెడ్డి తెలిపారు.
- గాంధీరోడ్డులోని శ్రీచైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో వర్షిత 464, తసీన్, జ్యోత్స్న, మనిష్ 463, బైపీసీలో మానిష 428, రెండవ సంవత్సరం ఎంపీసీలో దీప్తి 987, లోహిత్ 985, రేణు సుజన 982, బైపీసీలో దీప్తి 980,మానస 975 మార్కులు సాధించారని ఏజీఎం ప్రసాద్, ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు.
- కొత్త బస్టాండ్ వద్ద ఉన్న విజ్ఞానసుధ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో లిఖిత్ 463, గిరీష్ 454, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో విజయలక్ష్మి 983, స్నేహ 950, బైపీసీలో సదఫ్ 966 మార్కులు సాధించినట్లు ఆ కళాశాల వీసీ శ్రీధర్ తెలిపారు.
- మిట్టూరులోని వీసీఆర్ కళాశాలలో మొదటి సంవత్సరం సీఈసీలో నాగలక్ష్మి 457, దివ్య 426, ఎంపీసీలో జ్యోతి 429, రెండవ సంవత్సరం ఎంపీసీలో భార్గవి 861 మార్కులు సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ రిజ్వాన్, ప్రిన్సిపల్ జగన్నాధ రెడ్డి చెప్పారు.
- మిట్టూరులోని విజయం కళాశాలలో రెండవ సంవత్సరం ఎంపీసీలో తనూషా 982, హర్షవర్ధన్ 980, బైపీసీలో నందిని 983, లోహిత 963, మొదటి సంవత్సరం ఎంపీసీలో తనుశ్రీ, లీనా 459, బైపీసీలో సౌమ్య 411 మార్కులు సాధించారని చైర్మన్ తేజోమూర్తి తెలిపారు.



శ్రీచైతన్య కళాశాలలో....



విజ్ఞానసుధ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న వీసీ శ్రీధర్

ముమ్మరంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు

గుడిపాల: ప్రజలంతా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమ పథకాలు కొనసాగాలని కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ యువత అధ్యక్షుడు శిలంబరసన్ అన్నారు. గురువారం నరహరిపేట, గుడిపాల క్రాస్, వసంతాపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను పలకరించారు. టీడీపీ పాలనకు, జగనన్న పాలనకు మధ్య తేడాను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ రెడ్డి, సుశేంద్రారెడ్డి, రేణుకుమార్, తేజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



ఐరాల పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంఈఓ



తాళ్లమడుగులో పాఠశాల వార్షికోత్సవం జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఐరాల: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని పి.ఎర్రేపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. దీనికి హాజరైన ఎంఈవో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫాం, కొత్త పుస్తకాలు అందిస్తామని తెలిపారు. చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, హెచ్ఎం సత్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

యాదమరి: మండలంలోని తాళ్లమడుగు ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఉదయం పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథ్, సుబ్రమణ్యం పిళ్లై, సీఆర్‌పీ ప్రియాంక, తల్లి దండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.